సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



పనితీరుకు ప్రశంస

జిల్లాలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందిని 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్' అవార్డుతో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శుక్రవారం ప్రశంసించారు. -8లో



మల్లయ్యకొండ అడవికి నిప్పు

తంబళ్లపల్లె మండలంలోని మల్లయ్యకొండ, సాధు, ఇనుముకొండ సమీపంలోని అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు.600 హెక్టార్లలో అడవి దగ్ధమైంది. -8లో

గరిష్టం/కనిష్టం
37.5/23.7

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 23.7 – 37.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'పది' పరీక్షకు ఉచిత ప్రయాణం

కడప కోటిరెడ్డిసర్కిల్: పదవ తరగతి (టెన్త్) పరీక్ష రాసే విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మార్చి 18 నుంచి 30వ తేది వరకు జరిగే పరీక్షలకు హాజరయ్యే వారు తమ హాల్ టిక్కెట్ చూపించి కేంద్రాలకు ఉచితంగా వెళ్ల వచ్చని తెలిపారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఈ సదుపాయం ఉంటుందన్నారు.

రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని దుకాణాలు, సంస్థలు ఏర్పాటు చేసేవారు సంస్థలు, దుకాణాల చట్టం–1988 కింద తప్పనిసరిగా నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని ఉప కార్మిక కమిషనర్ బి.శ్రీకాంత్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ వర్తక, యాజమాన్యం సంఘాల వారు ఈ విషయంపై దుకాణదారులకు అవగాహన కల్పించి ఈనెల 29వ తేదీలోగా తమ సంస్థలు, దుకాణాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని తెలిపారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఏఎఫ్‌యూ: కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం 3వ, 5వ, 7వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3వ సెమిస్టర్‌లో 100 శాతం, 5వ సెమిస్టర్‌లో 83 శాతం, 7వ సెమిస్టర్‌లో 89 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. పరీక్షా ఫలితాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. నిర్ణీత సమయంలో ఫలితాలు విడుదల చేసినందుకు పరీక్షల విభాగాన్ని వీసీ అభినందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఇ.సి. సుప్రియ, సహాయ అధికారులు ఉదయ ప్రకాష్‌రెడ్డి, లక్ష్మీప్రవల్లిక పాల్గొన్నారు.

రేపు కబడ్డీ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని శివశివాని హైస్కూల్ మైదానంలో ఈనెల 25వ తేదీ ఆదివారం ఉదయం 70వ జిల్లాస్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ (రిజిష్టర్డ్ 115/2010) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. గోవర్ధన్‌రెడ్డి, టి. జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. 85 కేజీల లోపు బరువు కలిగి ఉన్నవారు మాత్రమే ఎంపికలకు అర్హులన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే వారు మార్చి 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లా కొవ్వూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

డీఎస్ఏ మైదానంలో ఎంపికలు..

కడపలోని డీఎస్ఏ క్రీడామైదానంలో ఈనెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి సీనియర్ కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ (రిజిష్టర్డ్ 195/2023) అధ్యక్ష, కార్యదర్శులు ఓ. రవీంద్రారెడ్డి, ఆర్. వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే వారు మార్చినెల 3,4,5 తేదీల్లో వైజాగ్‌లో జరిగే అంతర్ జిల్లాల పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 6304809294 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వందశాతం పన్నుల వసూలు లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి

వేంపల్లె: జిల్లా వ్యాప్తంగా 2023–24 సంవత్సరానికి గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్నుల వసూలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వేంపల్లెలోని గ్రామ పంచాయతీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మార్చి చివరి నాటికి రూ.16కోట్లు వసూలు చేయాలని అధికారులకు సూచించామన్నారు. ఇప్పటివరకు రూ.4కోట్లు వసూలైందన్నారు. గ్రామ పంచాయతీలో పారిశుధ్యం, డ్రైనేజీ, వీధిలైట్లు తదితర వాటిని మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ గ్రామ పంచాయతీలో భాగంగా తడి, పొడి చెత్త వేసుకునేందుకు ఒక్కో ఇంటికి రెండు బుట్టలు చొప్పున పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, డీఎల్‌పీఓ రమాదేవి, ఈఓ వెంకటసుబ్బారెడ్డి, గ్రామ సెక్రటరీలు, వార్డు మెంబర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భానుడి భగభగ

- ఫిబ్రవరిలోనే సుర్రుమంటున్న సూరీడు
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- తగ్గిన చలి ప్రభావం



కడప అగ్రికల్చర్: వేసవికాలం రాకముందే భానుడు భగభగమంటున్నాడు. ఫిబ్రవరి మూడో వారంలోనే ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం 11 గంటల నుంచి ఎంత తీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు రాత్రి పూట చలి తగ్గి ఉక్కపోత పెరిగింది. జిల్లాలో మూడు రోజుల నుంచి ఒక్కసారిగా 37 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో జనాలు బెంబేలెత్తి పోతున్నారు. ఫిబ్రవరి నెలలోనే ఉష్ణోగ్రతలు పెరిగితే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఇదే సమయంలో 34.7 నుంచి 35.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు ఉండేవి. అలాంటిది ఈ ఏడాది ఇదే సమయానికి 37.1 నుంచి 37.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గతేడాది కంటే ఈ సంవత్సరం వర్షాలు కూడా తక్కువగా కురవడం కూడా ఇందుకు ఒక కారణంగా తెలుస్తోంది. దీనికితోడు వాహనాల సంఖ్య పెరిగి వాయు కాలుష్యం ఎక్కువగా ఉండటం మరో కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

- జిల్లాలో గత వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతూ వస్తున్నాయి. ఈ నెల 17వ తేదీ శనివారం 33.9 డిగ్రీల ఉష్ణాగత్ర నమోదు కాగా 18వ తేదీ 34.8 , 19వ తేదీ 36.4, 20వ తేదీ 36.8, 21వ తేదీ 37.1, 22వ తేదీ 37.4, 23వ తేదీ 37.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఉష్ణోగ్రత క్రమేపీ పెరగడం, గాలిలో కూడా తేమశాతం తగ్గడంతో ఉక్కపోత పెరుగుతోంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
- ఈ ఏడాది చలి తీవ్రత కూడా అంతంత మాత్రంగానే ఉంది. మొదట్లో కొద్ది రోజులు ఉన్నా తర్వాత దాని ప్రభావం తగ్గింది.

మార్చి 1వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం...

ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్, మార్చి 18వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు కూడా ప్రారంభంకానున్నాయి. పరీక్షలు మొదలయ్యేది ఉదయమే కాబట్టి ఎండ తీవ్రత కొద్దిగా తక్కువ ఉన్నా పరీక్ష ముగిసే సమయానికి మాత్రం అదరగొట్టే అవకాశం ఉంటుంది. కావున పిల్లలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

టోపీలకు పెరిగిన గిరాకీ



జిల్లాలో ఎండల తీవ్రత పెరగడంతో ఎండ నుంచి తప్పించుకునేందుకు టోపీలను, చిన్నపాటి గొడుగులను కొనుగోలు చేస్తున్నారు. ఇన్ని రోజులు ఎక్కడో దాచిన వీటిని బయటకు తీసుకున్నారు. కడపలోని పలు కూడళ్లలో టోపీలకు సంబంధించిన తోపుడు బండ్లు వెలిశాయి. దీంతో టోపీల వ్యాపారం ఊపందుకుంది.

మొదలైన కూలర్ల వాడకం



జిల్లాలో ఎండల తీవ్రత పెరగడంతో ఇక కూలర్లు, ఏసీలకు పని మొదలైయిందనే చెప్పాలి. చాలా మంది తమ ఇళ్లలో ఉన్న ఏసీలను సరీ్వసింగ్ చేయిస్తున్నారు. వీటితోపాటు ఎత్తయిన భవనాల్లో ఉండేవాళ్లు కూల్ పెయింట్లను వేయించేందుకు సిద్ధం అవుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



జిల్లాలో ఎండత తీవ్రత క్రమేపీ పెరుగుతోంది. కావున విద్యార్థులు, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలకు ఎక్కువగా తిరిగేవాళ్లు తలపై టోపీలను ధరించాలి. మంచినీటిని క్రమం తప్పకుండా తీసుకోవాలి. అలాగే పండ్లరసాలు, జావ, నీటిశాతం ఎక్కువగా ఉన్న పండ్లను తీసుకోవడం మంచింది.

– ఎ.అర్జున్‌కుమార్, ప్రముఖ వైద్యులు, రిమ్స్

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాల సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్‌మీనా కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు కార్యక్రమాలు పూర్తి చేస్తున్నామన్నారు. ఎపిక్ కార్డుల జనరేట్ చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు శిక్షణా కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. ఫారం-6, 7, 8 పెండెన్సీపై, గ్రీవెన్స్‌ల పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రాష్ట్ర సీఈఓకు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్, మొబైల్ కనెక్టివిటీ సౌకర్యాలపై దృష్టి సారించాలని జిల్లా అధికారులకు కలెక్టర్ సూచించారు.

ఈఆర్‌ఓలు, నోడల్ అధికారులతో సమీక్ష

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తమకు కేటాయించిన విధులపై అవగాహన పెంచుకుని అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఈఆర్‌ఓలు, నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణా కార్యక్రమాలు, మెటీరియల్, రవాణా, పోస్టల్ బ్యాలెట్, స్వీప్ కార్యక్రమాలు, సి-విజిల్, ఈవీఎంల నిర్వహణ, వ్యయ పరిశీలన, ఎంసీఎంసీ తదితర అంశాల్లో పూర్తి బాధ్యతతో పని చేయాలని చెప్పారు. మాస్టర్ ట్రైనర్లతో శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈనెలాఖరుకు అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఇంకా చేపట్టాల్సిన ప్రాథమిక చర్యలపై పూర్తి స్థాయిలో నివేదికలు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా చర్యల ఆంక్షలను కఠినతరం చేయాలి

ప్రయాణికుల భద్రత కోసం చేపడుతున్న రోడ్డు భద్రత చర్యల ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ విజయరామరాజు తోపాటు కడప నగర కమీషనర్ ప్రవీణ్ చంద్, ఏఎస్పీ సుధాకర్, కమిటీ మెంబర్ కన్వీనర్– డీటీసీ మీరా ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి వాహన ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. రియల్టర్లు, రాజకీయ ప్రమేయాలకు స్పందించకుండా రోడ్డు భద్రతా ఆంక్షలను కఠినతరం చేయాలన్నారు. ముఖ్యంగా విద్యా సంస్థల వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు, అలాగే ప్రతి పెట్రోల్ బ్యాంకులు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చర్యలు తీసుకోవాలన్నారు. మలుపుల వద్ద బ్యారికేడ్లు, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను పొందుపరచాలన్నారు. రహదారులపై ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించి వాహనాలు నడిపేవారిని ఎవరు గమనించినా అలాంటి వారి వాహనం నెంబరు కనిపించేలా ఫోటో తీసుకుని సిటిజన్ పోలీసింగ్ వాట్సప్ నెంబర్ 9542800800 కు ఫిర్యాదు చేయాలని..ఫిర్యాదు చేసిన వారి వివరాలు కూడా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, ఆర్అండ్‌బీ (ఎన్‌హెచ్ డివిజన్)ఈఈ విజయ్‌భాస్కర్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ డా. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్- 2 పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

కడప సెవెన్‌రోడ్స్: ఈనెల 25వ తేదీన జరిగే గ్రూప్– 2 పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో అన్ని పరీక్షకేంద్రాల్లో ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని సభాభవన్ లో ఏపీపీఎస్సీ, గ్రూప్– 2 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై.. రూట్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లతో జిల్లా రెవెన్యూ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్– 2 సర్వీసెస్ (స్క్రీనింగ్ టెస్ట్)ఆబ్జెక్టివ్ టైప్ పరీక్షను జిల్లాలోని 67 కేంద్రాల్లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఈనెల 25వ తేదీన ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి 01:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 23,806 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారన్నారు. జిల్లాలోని 67 పరీక్ష కేంద్రాలకు.. 17 మంది రూట్ ఆఫీసర్లు (జిల్లా స్థాయి అధికారులు), 67 మంది లైజన్ ఆఫీసర్స్ (మండల స్థాయి అధికారులు)లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. మారుమూల ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకునేందుకోసం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రెటరీ (మానిటర్) ఎన్. ప్రమీల, సెక్షన్ ఆఫీసర్ విజయ నిర్మల, రూట్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న తెలుగు తమ్ముళ్లు

- రమేష్ రెడ్డికి టీడీపీ టికెట్ నిరాకరించడంతో నిరసన
- లక్కిరెడ్డిపల్లె మూడు రోడ్ల కూడలిలో టీడీపీ జెండాలు, కరపత్రాల దగ్ధం



టీడీపీ జెండాలను కాలుస్తున్న నాయకులు

లక్కిరెడ్డిపల్లె: అన్నమయ్య జిల్లా రాయచోటి టీడీపీ టికెట్ ను మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కేటాయించడంపై ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్ కుమార్ రెడ్డి వర్గీయులు భగ్గుమన్నారు. టీడీపీ పదవులకు శనివారం మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నట్లు రమేష్ రెడ్డి అనుచర వర్గం ప్రకటించింది. మరో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి అనుచరులు కూడా రాం ప్రసాద్ రెడ్డికి టికెట్ కేటాయించడంపై తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో టీడీపీ జెండాలను ,కరపత్రాలను లక్కిరెడ్డిపల్లి ముడు రోడ్ల కూడలిలో నిప్పు పెట్టి దగ్ధం చేశారు. చంద్రబాబు నాయుడు పోస్టర్ల పైన చెప్పులతో చితకబాదుతూ టీడీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డబ్బుకు అమ్ముడుపోయిన చంద్రబాబు డౌన్ డౌన్, లోకేష్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

రైతు సంక్షేమమే జగనన్న ధ్యేయం





ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, దివ్యాంగులకు త్రీవీలర్ వాహనాలను పంపిణీ చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల పట్టణంలోని భాకరాపురంలో ఉన్న సీఎం వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీని కలిసేందుకు వేలాది మంది ప్రజలు వచ్చి వినతి పత్రాలు సమర్పించారు. వినతులు స్వీకరించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.అనంతరం ఎస్సీ కార్పొరేషన్ కింద మంజూరైన 64 పవర్ టిల్లర్ మిషన్లను పంపిణీ చేశారు.

ఎంపీని కలిసిన నేతలు

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికలలో తీసుకోవాల్సిన నియమాలు, పార్టీ అభివృద్ధి, పార్టీ బలోపేతం తదితర విషయాలపై వారు చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, డైరెక్టర్లు మరకా శివకృష్ణారెడ్డి, రవీంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూతనందించడం సంతృప్తినిచ్చింది

పులివెందుల: దివ్యాంగుల దయనీయ పరిస్థితి చూసి ఎంత ఖర్చయినా సరే వారికి మూడు చక్రాల బైకులను అందజేసి వారు తమ దైనందిన కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు చేయూతనందించడం తన జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన అంశమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక భాకరాపురంలోని సీఎం వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తన సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన 18 త్రీవీలర్ స్కూటీలను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లతో కలిసి దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 73త్రీవీలర్ బైకులు దివ్యాంగులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు కడప ఎంపీ తన సొంత నిధులు రూ.80లక్షలు ఖర్చు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ రెండు కాళ్ల పనిచేయక తీవ్ర వైకల్యంతో బాధపడుతున్న నిరుపేద దివ్యాంగుల దయనీయ పరిస్థితిని చూసి చలించిపోయాయని.. తాను గ్రామాల్లో పర్యటించినప్పుడు, వారి దీన పరిస్థితి వివరించినప్పుడు దివ్యాంగులకు సొంత నిధులతో త్రీవీలర్ బైకులను వితరణగా అందించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సునీల్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, డేనియల్, దాసరి చంద్రమౌళి, కోలా ప్రసాద్, బలిజపల్లె గంగిరెడ్డి, మంజుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

టీడీపీలో టికెట్ గోల

- తంబళ్లపల్లె టికెట్ మాదంటే మాదే అంటూ ప్రచారం
- పార్టీశ్రేణులతో మదనపల్లెలో మాజీ ఎమ్మెల్యే శంకర్ సమావేశం
- టికెట్ తనకే ఇస్తారని మరో నేత కార్ల ర్యాలీతో సంబరం
- చంద్రబాబు మార్క్ రాజకీయం అంటున్న పరిశీలకులు

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. టీడీపీ అధిష్టానం పార్టీ అభ్యర్థిత్వాన్ని ఇంకా ఖరారు చేయకముందే ఎవరికి వారు టికెట్ మాదంటే మాదే అంటూ పోటాపోటీగా ప్రచారం చేసుకుంటున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి.. మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్ వర్గీయులు, ఇటీవల టీడీపీలో చేరిన ఓ నేత వర్గీయులు పార్టీ టికెట్ తమనేతలకే చంద్రబాబు ఖరారు చేశారంటూ టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ములకలచెరువు మండలానికి చెందిన ఓ నేత చంద్రబాబును కలిసిన ఫొటోలతో, అభ్యర్థిత్వం మా నేతకే ఖరారు చేశారని, రెండురోజుల్లో ప్రకటిస్తారని చెబుతూ సోషల్‌మీడియాలో ప్రచారం చేసుకున్నారు. దీనిపై గురువారం రాత్రి బి.కొత్తకోటలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గీయులు చంద్రబాబు టికెట్ ఖరారు చేశారంటూ బస్టాండ్‌లో నినాదాలు చేశారు. చంద్రబాబు టికెట్ ఎవరికి ఖరారు చేశారంటూ చర్చ మొదలవగా శంకర్ వర్గీయుల్లో ఆగ్రహం వ్యక్తమైంది.

హడావుడిగా సమావేశం

ఇటీవల పార్టీలో చేరిన నేత టికెట్ తనకే అన్న ప్రచారంతో మాజీ ఎమ్మెల్యే శంకర్ శుక్రవారం మదనపల్లెలోని తన కార్యాలయంలో హడావుడిగా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ మొత్తం తనవెంటే ఉందని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. ఆరు మండలాలకు చెందిన పార్టీ కన్వీనర్లు, జిల్లా, రాష్ట్ర పార్టీ పదవులున్న నేతలు, నామినేటెడ్ మాజీ ప్రతినిధులు, పార్టీ శ్రేణులతో జరిపిన సమావేశంలో మాట్లాడిన ఆయన..ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ తనకే ఇస్తారని చెప్పుకున్నారు. ఈ విషయమై శంకర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో ఫోన్‌లో మాట్లాడినట్టు తెలిసింది. టికెట్ ఎవరికి అన్నది ఇంకా ఖరారు చేయలేదని చెప్పినట్లు శంకర్ వర్గీయులు



తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ శ్రేణులకు సమస్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్

ప్రచారం చేస్తున్నారు. పార్టీ కోసం కష్టపడ్డామని, తనకే న్యాయం జరుగుతుందని శంకర్ పార్టీ శ్రేణులతో చెప్పుకున్నారు. ఈ మీటింగ్ అయిపోయాక టికెట్ తనకే ఖరారు చేశారని ఓ నేత తన వర్గీయులతో కురబలకోట నుంచి ములకలచెరువు వరకు శుక్రవారం కార్లతో ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. శంకర్‌ను వ్యతిరేకించే కొందరు కార్యకర్తలు ఈ ర్యాలీలో కనిపించారు.

పార్టీ బలం తగ్గుతోందనే వ్యూహం

తంబళ్లపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలం రోజురోజుకు తగ్గిపోతోంది. 2019 తర్వాత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులు చరిత్రలో లిఖితమయ్యే స్థాయిలో జరిగాయి. వచ్చే 30 ఏళ్లకు జరగాల్సిన అభివృద్ధి ఐదేళ్లలోనే జరిగింది. దీంతో టీడీపీపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. 2019 ఎన్నికల్లో టీడీపీ 26,938 ఓట్ల తేడాతో ఓటమిపాలైంది. అప్పటి నుంచి స్థానిక సంస్థల ఎన్నికల వరకు టీడీపీ బలం తగ్గడమే కానీ పుంజుకుంది లేదు. 2022 వరకు నియోజకవర్గ నేతల ఉనికి కూడా కనిపించలేదు. వైఎస్సార్‌సీపీ పోటీని తట్టుకునే పరిస్థితి లేదని గ్రహించిన చంద్రబాబు టికెట్ కావాలని తనను ఎవరు కలిసినా మీకే టికెట్ అంటూ ప్రోత్సహించడం ద్వారా పార్టీకి క్రేజ్ తీసుకురావాలని వ్యూహం పన్నినట్టు పలువురు చర్చించుకుంటున్నారు. ఈ మధ్య మరోనేత కూడా టీడీపీ లేదా జనసేన అభ్యర్థిత్వతం ఆశిస్తూ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఇలాంటి కార్యక్రమాలతో పార్టీ ఉనికిని కాపాడుకునే ప్రయత్నాల్లో భాగంగానే ఎవరు టీడీపీలో చేరినా టికెట్ మీకే అని ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. గత ఏడాదిలో టీడీపీలో చేరిన ఓ నాయకుడిని పార్టీలో చేర్చుకోవద్దంటూ నియోజకవర్గ నేతలు చంద్రబాబు చెప్పినా వినలేదు. చంద్రబాబు వ్యూహంలో ఎవరు బలిపశువులు అవుతారో అని టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

నమ్ముకుంటే ముంచేస్తారా

మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్‌కు టికెట్ దక్కుతుందా లేదా అన్న చర్చ జరుగుతున్న నేపథంలో తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న వాళ్లను ముంచేస్తారని శంకర్ వర్గీయులు విమర్శిస్తున్నారు. అభ్యర్థిత్వాన్ని ఇంకా ఖరారు చేయకపోయినా కొత్తగా వచ్చిన నాయకులు తమకే టికెట్ ప్రకటించారని ఎలా ప్రచారం చేసుకుంటారని శంకర్ వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. పార్టీని నమ్ముకున్న వారిని ముంచేయడమే చంద్రబాబు నైజమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త నేత కార్ల ర్యాలీ నిర్వహించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఇకపై నియోజకవర్గ రాజకీయాలు క్రియాశీలం అవుతామని స్పష్టం చేస్తున్నారు.


క్లుప్తంగా

అరటి పంట దగ్ధం



లింగాల : లింగాల మండలం కోమన్నూతల గ్రామం సమీపంలో అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సమీపంలో రేణుకా రెడ్డి రెండు ఎకరాల్లో సాగు చేసిన అరటి తోట దగ్ధమైంది. పంటతోపాటు డ్రిప్, ఇరిగేషన్ పైపులు, ల్యాడర్, పోటు కట్టెలు కాలి సుమారు రూ.5 లక్షల మేర నష్టం కలిగిందని బాధితులు తెలిపారు. పేద రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రూ.40 లక్షల నష్టం



కాశినాయన : మండలంలోని అక్కంపేట గ్రామానికి చెందిన కౌలు రైతు వేముల వెంకటేశ్వర్లు పది ఎకరాల్లో సాగు చేసిన అరటి పంట శుక్రవారం పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు, రైతులవివరాల మేరకు మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఉన్నట్లుండి తోటకు నిప్పంటుకుందని తెలిపారు. వారం, పది రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో గెలలు పూర్తిగా కాలిపోయాయని, డ్రిప్, ఇతర వైర్లు కాలిపోవడంతో రూ.40 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు. ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందజేయాలని రైతు కోరాడు.

మార్చురీలో గుర్తుతెలియని శవం



కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో ఈ నెల 21వ తేదీన అనారోగ్యంతో వైద్యం చేయించుకునేందుకు వచ్చాడు. 22న రాత్రి అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో వుంచారు. ఎవరైనా ఆచూకీ తెలిసిన వారుంటే తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

పనితీరుకు ప్రశంస

పోలీసులకు 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు'

కడప అర్బన్ : జిల్లాలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందిని 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మన్స్' అవార్డుతో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ శుక్రవారం ప్రశంసించారు. ముగ్గురు సివిల్, స్పెషల్ బ్రాంచ్, ఎస్.ఈ.బి నుంచి సిబ్బందిని ఎంపిక చేసి నగదు రివార్డు, ప్రశంసాపత్రం అందజేశారు.

- జిల్లా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.ప్రతాప్ (హెచ్‌సీ139) అత్యుత్తమ పనితీరు కనబరచడంతో ప్రశంసించారు.
- బద్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పి.పి.కుంట చెక్ పోస్ట్ వద్ద ఆర్టీసీ బస్సుల్లో ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.45 లక్షలు నగదు స్వాధీనం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించిన కానిస్టేబుల్ ఎల్. అమరేశ్వర్ రెడ్డి (పి.సి. 2519)ని ఎస్పీ అభినందించారు.
- ఇటీవల పుదుచ్చేరికి చెందిన 318 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కానిస్టేబుల్ కె. విశ్వనాథరెడ్డి కీలకపాత్ర పోషించారు. ఆయనను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.
- ముద్దనూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె. రమేష్‌కుమార్ 2016లో జరిగిన ఓ హత్య కేసులో ముద్దాయిలకు ప్రొద్దుటూరు సెకండ్ ఏడిజె కోర్టు యావజ్జీవ శిక్ష, జరిమానా విధించడంలో కీలకపాత్ర పోషించారు.



సిబ్బందిని 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు'లతో అభినందిస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరయ్యేలా చేసి త్వరితగతిన నేర నిరూపణ చేయడంలో పనితీరు కనపరిచారు. రమేష్‌కుమార్‌కు ప్రశంసాపత్రం, నగదు రివార్డు ఎస్పీ అందచేశారు.

- ప్రొద్దుటూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ. 15 లక్షలు విలువైన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు దొంగను అరెస్ట్ చేసిన కేసులో ఎం.తిరుమలయ్య (పి.సి.1359) కీలకపాత్ర పోషించారు. జిల్లా ఎస్పీ ఆయనను అభినందించారు.

ప్రొవిజనల్ జాబితా విడుదల

రిమ్స్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు 26 నుంచి 28 వరకు అభ్యంతాల స్వీకరణ

కడప అర్బన్ : కడప ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెల్త్, కేన్సర్ కేర్ సెంటర్లలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన జరిగే నియామకాలకు ప్రొవిజనల్ మెరిట్ లిస్టును వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎ.సురేఖ తెలిపారు. కడప జిల్లా ప్రభుత్వ వెబ్‌సైట్ https://kadapa. ap.gov.in లో ఉంచామని, అభ్యంతరాలుంటే అభ్యర్థులు పరిశీలించి స్వయంగా ఆఫీసు పనిసమయాలలో సమర్పించాలని తెలిపారు. పోస్టు ద్వారా పంపబడినవి స్వీకరించమన్నారు.

కలుషితాహార ఘటనపై విచారించాలి

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో చోటు చేసుకున్న కలుషితాహార ఘటనపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు జి.వలరాజు, ఎం.ఆర్.నాయక్, శంకర్, ఓ. నాగేంద్రబాబు, జగదీష్ డిమాండ్ చేశారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అధికారులు వసతి గృహాలపై ప్రత్యేక దృష్టిసారించిఈ ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి: డీవైఎఫ్ఐ

యోగి వేమన విశ్వవిద్యాలయం వసతి గృహంలో కలుషితాహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్, రాఘవ, ప్రభు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పరిశుభ్రమైన ఆహారం ఇవ్వాలి : ఒంటేరు

వైవీయూ విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణ పోలీసులపై నిందితులు దాడి

9 మందిపై హత్యాయత్నం కేసు

మైదుకూరు : ఓ కేసులో నోటీసులు ఇచ్చేందుకు వచ్చిన తెలంగాణ పోలీసులపై మైదుకూరు మున్సిపాలిటీలోని చిన్నయ్యగారిపల్లెకు చెందిన గొర్రెల కాపరులు దాడి చేశారు. ఈ సంఘటనలో 9 మందిపై మైదుకూరు అర్బన్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మైదుకూరు అర్బన్ ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపిన మేరకు.. మైదుకూరు మున్సిపాలిటీలోని చిన్నయ్యగారిపల్లెకు చెందిన ఓబుగాని శివ, అతని తండ్రి సాంబయ్య తెలంగాణలోని నల్గొండ జిల్లా చందంపేటకు చెందిన ఆరుగురి వద్ద గొర్రెలు కొనుగోలు చేశారు. ఆ మేరకు కొంత అడ్వాన్స్ ఇచ్చి, మిగిలినది తర్వాత ఇస్తామని నమ్మబలికారు. గొర్రెలకు సంబంధించి రూ.30 లక్షలు ఇవ్వాల్సి ఉంది. చాలా రోజులుగా ఇవ్వకుండా మాట దాటవేస్తుండటంతో గొర్రెల యజమానులు చందంపేట పోలీస్ స్టేషన్‌లో శివ, అతని తండ్రి సాంబయ్యలపై ఫిర్యాదు చేశారు. ఆ మేరకు చందంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గురువారం రాత్రి చందంపేటకు చెందిన గొర్రెల యజమానుల్లో ఒకరైన టేకులపల్లి అంజయ్య, ఎస్ఐ సతీష్, ఇద్దరు కానిస్టేబుళ్లు ఇన్నోవా వాహనంలో చిన్నయ్యగారిపల్లెకు చేరుకున్నారు. చందంపేట పోలీస్‌స్టేషన్‌లో శివ, సాంబయ్యలపై నమోదైన కేసుకు నోటీసులు ఇవ్వబోయారు. శివ, అతని తండ్రి సాంబయ్య నోటీసులు తీసుకోకపోవడమేగాక, వారి బంధువులతో కలిసి చందంపేట ఎస్ఐ, కానిస్టేబుళ్లు, అంజయ్య, వాహనం డ్రైవర్‌పై దాడి చేసి కొట్టారు. ఇన్నోవా వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ విషయమై అంజయ్య మైదుకూరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఓబుగాని శివ, అతని తండ్రి సాంబయ్య, మరో ఏడుగురిపై దాడి చేసి హత్యాయత్నం చేసినందుకు, విధుల్లో ఉన్న పోలీసులపై దాడి చేసినందుకు నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి వివరించారు.

స్టాఫ్ నర్సులకు పదోన్నతులు

కడప రూరల్ : కడప వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం(జోన్-4) పరిధిలో స్టాఫ్ నర్సుల పదోన్నతులకు నిర్వహించిన కౌన్సెలింగ్ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. రాయలసీమ జిల్లాల పరిధిలో అర్హులైన 39 మందిలో 27మంది హెడ్ నర్సులుగా పదోన్నతులు పొందారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ నిబంధనల మేరకు పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ డీడీ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్ అతావుల్లా, బత్తనయ్య, వనీష, రవి తదితరులు పాల్గొన్నారు.



హెడ్ నర్సు పదోన్నతులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీ రత్నకుమారి

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు పది కిలోమీటర్ల దూరంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయాలపాలయ్యారు. ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం గంజరపల్లెకు చెందిన ఆర్మీజవాన్ మనోజ్(32), మరో ఇద్దరు తిరుపతి, అంజి పోరుమామిళ్ల నుంచి బైక్‌లో వెళ్తుండగా ఈ ప్రమాదంజరిగింది. మనోజ్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బైక్ అదుపు తప్పి కింద పడినట్లుగా భావిస్తున్నామని, మరో వాహనం ఢీకొన్నట్లు ఆనవాళ్లు లేవని ఆయన తెలిపారు. దర్యాప్తులో పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. గాయపడిన తిరుపతి, అంజిలను ప్రథమ చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు పంపించారు.



ప్రమాద స్థలంలో మృతదేహం

ఏపీ టెట్ పరిశీలకులుగా వెంకటకృష్ణారెడ్డి



కడప ఎడ్యుకేషన్ : ఏపీ టెట్-2024 ఎగ్జామినేషన్‌కు వైఎస్సార్ జిల్లా స్థాయి పరిశీలకులుగా ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ మార్తాల వెంకట క్రిష్టారెడ్డిని శుక్రవారం ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 27వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు టెట్ పరీక్ష నిర్వహించనున్నారు. అలాగే కడప ఆర్‌జేడీగా పనిచేస్తున్న ఎద్దుల రాఘవరెడ్డిని సత్యసాయి, అనంతపురం జిల్లాలకు పరిశీలకులుగా నియమించారు.

కూలిన స్తంభం : తప్పిన ప్రమాదం

కడప అర్బన్ : విద్యుత్తు స్తంభాలు కూలిపోగా పెను ప్రమాదం తప్పింది. కడప నగరంలోని ముత్తరాసపల్లెలో జేసీబీతో కాల్వ పనులు చేస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి. ఒక్కసారిగా స్తంభాలు పడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అయితే ఆ సమయంలో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారంతో విద్యుత్తు అధికారులు, చిన్నచౌక్ పోలీసులు స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



ఇంటిపైకూలిన విద్యుత్ స్థంభం

కారు బోల్తా : ఉపాధ్యాయినులకు గాయాలు

లింగాల : మండలంలోని లింగాల సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. ఉపాధ్యాయులు లక్ష్మిదేవి, రాజేశ్వరి, జయలలిత, నాగ శోభారాణి, పీఈటీ టీచర్ రమేష్ పులివెందుల నుంచి లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కారులో వస్తున్నారు. మార్గ మధ్యంలో లింగాల సమీపంలో కారు అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. 108 వాహనంలో పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



పొలంలో బోల్తా పడిన కారు

బెయిల్‌పై దస్తగిరి విడుదల

కడప అర్బన్ : మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని గత ఏడాది అక్టోబర్ 31న ఓ కిడ్నాప్ కేసులో నిందితుడిగా పోలీసులు అరెస్ట్ చేశారు. తరువాత మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు కడప కేంద్ర కారాగారంలో రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో కడప కేంద్ర కారాగారం నుంచి శుక్రవారం రాత్రి బెయిల్‌పై విడుదలయ్యాడు.



మీడియాతో మాట్లాడుతున్న దస్తగిరి

టీడీపీ లీగల్‌సెల్ నేతపై ఫిర్యాదు

రాజంపేట : రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీడీపీ లీగల్‌సెల్ నేత లక్ష్మీనారాయణపై ఏపీ అడ్వకేట్స్ బార్ కౌన్సిల్ చైర్మన్ ఘంటా రామారావుకు, రాజంపేట పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోసూరు సురేంద్రబాబు తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత ఏడాది అక్టోబరు 11న రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలలో గెలిచినట్లుగా ఎన్నికల అధికారి స్వయంగా ప్రకటించారన్నారు. లక్ష్మీనారాయణ తానే అధ్యక్షుడు అంటూ కుర్చీ వదలకుండా అనధికారికంగా చెలామణి అవుతున్నారని ఆరోపించారు. బీసీ వర్గానికి చెందిన తాను అధ్యక్షుడిగా ఉండటం ఓర్వలేక కుట్రలు చేస్తున్నారన్నారు. తెరవెనుక రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న సురేంద్రబాబు

మల్లయ్యకొండ అడవికి నిప్పు

600 హెక్టార్లు దగ్ధం

తంబళ్లపల్లె : మండలంలోని మల్లయ్యకొండ, సాధు, ఇనుముకొండ సమీపంలోని అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రెండు రోజులుగా మంటలు చెలరేగాయి. సుమారు 600 హెక్టార్లలో అడవి దగ్ధమైంది. విలువైన ఔషధ మొక్కలు, క్రిములు, వన్య ప్రాణులు, ఇతర పక్షులు మంటల్లో చిక్కుకుని అగ్నికి ఆహుతయ్యాయి. అడవిలో తుమికాకు(బీడీ ఆకు)కు నిప్పు పెడితే నాణ్యమైనది వస్తుందని, అవసరమైన పచ్చగడ్డి ఏపుగా పెరుగుతుందనే కారణాలతోనే కొందరు అడవికి నిప్పు పెడుతున్నట్లు ఆరోపణలున్నాయి. అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ రెడ్డివరప్రసాద్, బీట్ ఆఫీసర్ రామరాజ్ కొందరి సహకారంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.



మంటల్లో కాలుతున్న అడవి

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి

కడప అర్బన్ : ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రతి హౌస్ సర్జన్ మెలకువలు పాటించాలని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి అన్నారు. కడప ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఐపీ విభాగం లెక్చర్ గ్యాలరీలో శుక్రవారం జరిగిన సమావేశంలో డాక్టర్ సురేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ హౌస్ సర్జన్‌లు ప్రతి రోగిని ఆప్యాయంగా పలుకరించి చికిత్స అందించేందుకు కృషి చేయాలన్నారు. వైద్యులు తమ దగ్గరికి వచ్చిన రోగికి సంపూర్ణ స్థాయిలో వైద్యం అందించే అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు, డాక్టర్ రాజేశ్వరి, నాగశ్రీలత, మాధురీలత, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎం. సురేశ్వర్ రెడ్డి

బీర సాగు.. ఆదాయం బాగు

రాయచోటి : బీర పంట తక్కువ సమయంలోనే చేతికి రావడంతో పాటు మంచి ఆదాయాన్ని తెచ్చి పెడుతోంది. పందిరి పద్ధతిలో కాస్త ఓపికతో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి లాభాలు పొందవచ్చునని ఉద్యాన అధికారిణి నాగమణి తెలిపారు.

విత్తన శుద్ధి

కిలో బీర విత్తనానికి థైరమ్ 3 గ్రాములు, ఇమిడాక్లోప్రిడ్ 5 గ్రాముల చొప్పున ఒక దాని తరువాత మరొకటి కలిపి విత్తనశుద్ధి చేయాలి. తర్వాత వందగ్రాముల విత్తనానికి 2 గ్రాముల ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేయాలి.

మొక్కలు నాటే విధానం

వేసవిలో అధిక ఉష్ణోగ్రత ఉంటుంది. దీంతో మొక్క పెరుగుదల తక్కువగా ఉండి, పూత, పిందె తగ్గి దిగుబడులు తగ్గుతాయి. అందువల్ల తక్కువ దూరంలో నాటుకొని మొక్కల సాంద్రత పెంచాలి. ఎక్కువ మొక్కలుండటం వల్ల దిగుబడి తగ్గదు. విత్తడానికి ఎకరాకు 8 నుంచి 10 టన్నుల పశువుల ఎరువు 32 నుంచి 40 కిలోల భాస్వరం, 16 నుంచి 20 కిలోల పొటాష్ నిచ్చే ఎరువు వేసుకోవాలన్నారు. నత్రజనిని రెండు సమపాళ్లుగా చేసి విత్తిన 25 నుంచి 30 రోజులకు, పూత పిందె దశలో వేసుకోవాలి. మొక్కకు దగ్గరగా కాకుండా కాస్త దూరంలో వేయాలి. తర్వాత మట్టిని కప్పి నీటిని పెట్టడంతో ప్రయోజనం ఉంటుంది.

నీటి సదుపాయం


విత్తడానికి ముందు పొలంలో నీరు పెట్టాలి. తర్వాత ప్రతి 3 నుంచి 4 రోజులకోసారి గింజ మొలకెత్తే వరకు నీరు పెట్టాలి. పాదు చుట్టూ 3 నుంచి 5 సెంటీమీటర్ల మందం మట్టి ఎండినట్లుగా ఉన్నప్పుడు నీరివ్వాలి.

కోత-దిగుబడి

విత్తనం రకాన్ని బట్టి బీరకాయలు నాటిన 60 నుంచి 90 రోజుల్లో కోతకు వస్తాయి. కాయలు లేతగా ఉన్నప్పుడే కోయాలి. ఏ మాత్రం ఆలస్యమైనా అవి ముదిరి పీచు పదార్థం ఎక్కువై మార్కెట్‌కి పనికి రాకుండా పోతాయి. కాయలను ఒక అంగుళం కాడతో సహా కోయాలి.

వైరస్ తెగులు-నివారణ

వైరస్ తెగులు పేనుబంక ద్వారా ఒక మొక్క నుంచి మరో మొక్కకు వ్యాప్తి చెందుతుంది. తెగులు సోకిన మొక్క ఆకుల ఈనెల మధ్య మందంగా చారలు ఏర్పడి, ఆకులు పెలుసుగా మారతాయి. పూత, పిందెలు రావడం ఆగిపోతాయి. తెగులు సోకిన మొక్కలను ముందుగా గుర్తించి పీకి నాశనం చేయాలి. పేనుబంక నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు, లేదా డైమిథోయేట్ 2 మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. రసం పీల్చే పురుగులను సరైన సమయంలో గుర్తిస్తే నివారణకు మందులను పిచికారి చేసి దిగుబడులు పొందవచ్చు.



రాయచోటి పరిధిలో పందిరి సాగులో ఉన్న బీరకాయ తోట



నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

సొంతిల్లు కట్టుకున్నాం



నా పేరు దండు బోయిన సుభద్రమ్మ. కమలాపురంలోని సూర్య హైస్కూల్ వీధిలో ఉంటున్నా. నా భర్త వెంకటసుబ్బయ్య టైలర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మాకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందరికీ పెళ్లి చేశాం. ఇన్నాళ్లుగా సొంతిల్లు లేక అద్దె ఇంట్లోనే ఉన్నాం. ఇపుడు నవరత్నాల్లో భాగంగా మాకు పక్కా గృహం మంజూరైంది. జగనన్న ఇచ్చిన డబ్బుకు తోడుగా మేము కొంత పోగు చేసి సొంతిల్లు కట్టుకున్నాం. చాలా సంతోషంగా ఉంది. నా భర్తకు జగనన్న ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ కూడా ఇస్తోంది. సీఎంకు రుణపడి ఉంటాం. – డి.సుభద్రమ్మ, సూర్య హైస్కూల్ వీధి, కమలాపురం

విద్యా రంగంలో మార్పులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో వినూత్న మార్పులు తీసుకొచ్చారు. గతంలో మా పాఠశాలలో అరకొర సౌకర్యాలు ఉండేవి. 'నాడు-నేడు'తో మా పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. మధ్యాహ్నం భోజనం మొదలుకుని విద్యా సామగ్రి, దుస్తులు, బూట్లు ఇవ్వడమేగాక, అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆంగ్ల మాధ్యమం ఉండడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరుతున్నారు. నాణ్యమైన విద్య అందించడంతో అధిక మార్కులు సాధిస్తున్నారు. డిజిటల్ బోర్డు, బోధనతో వారిలో మరింత ఆసక్తి పెరిగింది. – ఎస్.అమరనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, రాజీవ్ కాలనీ, వేంపల్లె

వ్యక్తి అదృశ్యం



కూలీలను విచారిస్తున్న ఎస్ఐ వెంకటరమణ

వల్లూరు : చింతకొమ్మదిన్నె మండలం పలుగారిపల్లెకు చెందిన చెన్నయ్య అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. చెన్నయ్య స్థానిక మేస్త్రీ రామాంజులు వద్ద బేల్దారిగా పనిచేస్తున్నారు. తోటి వారితో కలిసి శుక్రవారం పుష్పగిరి సమీపంలోని పెన్నా నదిలో డిన్నర్ ఏర్పాటు చేసుకున్నారని, అనంతరం చెన్నయ్య కనిపించకుండా పోయారని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. చెన్నయ్య భార్య ఫిర్యాదు మేరకు.. ఎస్ఐ వెంకటరమణ, సిబ్బంది పుష్పగిరికి వెళ్లి వద్దకు వెళ్లి తోటి కూలీలను విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

కొండాపురం : మండలంలోని గండ్లూరు పొలాల్లో పేకాడుతుండగా 25 మందిని అరెస్టు చేసినట్లు కొండాపురం ఎస్ఐ యోగేంద్ర శుక్రవారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ఎస్పీ ఆదేశాలతో కడప నుంచి సీఐ వేణుగోపాల్, స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి పేకాట స్థావరాలపై దాడులు చేసి 25 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.1.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. దీంతోపాటు కారు, రెండు బైకులను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు

చిరుత సంచారం



నాగలగుట్టపల్లె వద్ద కాలుతున్న గుట్ట

చక్రాయపేట : చిరుత సంచారం నాగలగుట్టపల్లె వాసులను వణికిస్తోంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. నాగలగుట్టపల్లె, మూలపల్లె మధ్య గుట్టల్లో చిరుత సంచరిస్తోందని గ్రామస్తులు తెలిపారు. మేకల కాపరులకు కనిపించిన చిరుత హసన్ సాబ్‌కు చెందిన ఓ మేకను పట్టుకుందన్నారు. అతడు గ్రామస్తులకు చెప్పగా గాలించారన్నారు. శుక్రవారం సినిమాహాల్ సమీపాన ఉన్న వైష్ణవీ మాత ఆలయం వద్ద కనిపించిందని కొందరు చెప్పడంతో తరిమేందుకు గుట్టలకు నిప్పు పెట్టాల్సి వచ్చిందని నాగలగుట్టపల్లె వాసులు తెలిపారు. అటవీ అధికారులు స్పందించి చిరుతను పట్టుకోవాలని వేడుకొంటున్నారు.